## ఎమ్మెల్సీ ఎన్నికకు కట్టుదిట్టమైన భద్రత

### నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఏసీపీ తిరుపతి రెడ్డి

కూసుమంచి, మే 26: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేదుకు కావాల్సిన అన్నీ ఏర్పాట్లు చేశామని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. సోమవారం జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద సీపీ ఆదేశాల మేరకు బందోబస్తు, నిఘా పెట్టామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటు కలిగిన వారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉన్నందున ఎలాంటి పరిస్థితిలో ఇతరులను లోనికి అనుమతించేది లేదన్నారు. మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, స్థానిక సిబ్బందితోపాటు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులతో ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయిత్రం 4 గంటల వరకు జరిగే పోలింగ్‌లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసీపీ తిరుపతిరెడ్డి కోరారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కారేపల్లి, మే 26: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆదివారం పరామర్శించారు. తొలుత అంబేద్కర్ కాలనీలో మృతిచెందిన ఆదెర్ల పీరయ్య, పెద్దమ్మగడ్డ బజార్‌లో పెద్దం బాబు, బొడ్రాయి సెంటర్‌లో చీమలదారి సీతమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, బీఆర్ఎస్ నాయకులు హన్మకొండ రమేశ్, అడప పుల్లారావు, షేక్ గౌసుద్దీన్, జడల వెంకటేశ్వర్లు, తాతా వెంకన్న, కడారి వెంకట్, జూపల్లి రాము, డొంకెన రవి తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన మొక్కల తయారీలో రాజీపడొద్దు

ఖమ్మం రూరల్, మే 26: నాణ్యమైన మొక్కల తయారీలో రాజీ పడవద్దని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమశాఖ అధికారి బీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిరప నర్సరీల నిర్వాహకులు తప్పకుండా లైసెన్స్ కలిగిఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. నర్సరీ లైసెన్స్ కాలపరిమితికి 15రోజుల ముందే తిరిగి రెన్యూవల్ చేయించుకోవాలని ఆయన సూచించారు. నర్సరీల్లో నలుసులు (నకిలీలు) తేలితే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో హెచ్చరించారు. నారు పెంపకంలో ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా తీసుకోవాలన్నారు. లైసెన్స్‌లు పొందడానికి, దరఖాస్తులు సమర్పించేందుకు ఉద్యాన అధికారి ఖమ్మం 8977714103, పాలేరు నియోజకవర్గం ఉద్యాన అధికారి 8977714104, మధిర నియోజకవర్గం అధికారి 8977714113, వైరా, సత్తుపల్లి నియోజకవర్గం అధికారి 8977714105 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## 28న పునీత అన్నమ్మ నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

ఎర్రుపాలెం, మే 26: మండలంలోని అయ్యవారిగూడెంలో విచారణలో పునీత అన్నమ్మ పేర నూతన ఆలయం నిర్మాణం చేశారు. ఈ ఆలయ ప్రతష్ఠా మహోత్సవం ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు విచారణ గురువు సురేపల్లి ఐజాక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విశాఖ అగ్రపీఠం అపోస్తలిపాలనాధికారి ఉడుముల బాల, నల్గొండ పీఠాధిపతి దమన్‌కుమార్, ఖమ్మం విశ్రాంత పీఠాధిపతి మైపన్‌పాల్ హాజరవుతారని పేర్కొన్నారు. వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, చిలకమ్మ దంపతులు, వెన్నపూస లక్ష్మారెడ్డి, వెంకటనర్సమ్మలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

## పొట్టకూటి కోసం వృద్ధురాలి తిప్పలు



రోడ్ల వెంట చెత్తను ఏరుకుంటున్న వృద్ధురాలు

పెనుబల్లి, మే 26: జానెడు పొట్ట కోసం మండుటెండల్లో పండు ముసలమ్మ తిప్పలు పడుతోంది. మండలంలోని పాత కారాయిగూడెం గ్రామానికి చెందిన ఈ ముసలమ్మ ఇంటి వద్ద ఓ నూరేళ్ల వృద్ధ భర్త ఉన్నాడు. తమ పోషణ కోసం రోడ్ల వెంట పాతప్లాస్టిక్ సామన్లు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ వయస్సులో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితుల్లో రోడ్ల వెంట మండుటెండల్లో ఈమె పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **జిల్లేళ్ళ సీతారత్నం, W/o: ప్రసాద్, వయస్సు** : 53 సం||లు, **నివాసం** : ఇ.నెం. 6-141/1, వి.యమ్.బంజర గ్రామం, పెనుబల్లి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం జిల్లా రిజిస్ట్రారు, జిల్లా పరిషత్ ఖమ్మం, కల్లూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు పరిధిలోని కల్లూరు మండలం, కల్లూరు గ్రామ పంచాయితీ, కల్లూరు గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా సర్వే నెం. 419/ఒ/1/ఖ/1 మింజుమలె చంద్రుపట్ల రోడ్డులో 18-15 నెంబరు గల ఇంటికి సమీపమున ప్రతిభా తెలుగు మీడియం స్కూల్‌కు దగ్గరలో మరియు సెయింట్ మైఖేల్ స్కూల్‌కు వెనుక భాగంలో ఉన్న విస్తీర్ణం 182.79 చ||గ||లకు సమానమగు 152.81 చ||మీ||లు, **డాక్యుమెంట్ నెం. : 845/2024** గల ఖాళీనివేశన స్థలమునకు సరిహద్దులు : **తూర్పు** : జిల్లేళ్ళ నరసింహారావు గారి స్థలము, **పడమర** : మాచే ఏర్పాటు చేయబడిన రోడ్డు, **ఉత్తరం** : జిల్లేళ్ళ ప్రమీల గారి స్థలము, **దక్షిణం** : జిల్లేళ్ళ సత్యనారాయణ గారి స్థలము.

**పలివెల గణేష్ బాబు,** అడ్వకేట్, కొత్తగూడెం.
సెల్ : 9849246278

## మహిళ పై దాడి.. ఆరుగురిపై కేసు

తిరుమలాయపాలెం, మే 26: మండలంలోని సుబ్లేడులో శనివారం రాత్రి ఓ మహిళపై కర్రలతో దాడిచేసి గాయపర్చిన ఘటనలో ఆదివారం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుబ్లేడు గ్రామానికి చెందిన వశపొంగు లక్ష్మిపై ఎదురింటికి చెందిన కొందరు పాత గొడవలను దృష్టిలో పెట్టుకొని కర్రలతో దాడి చేసి కొట్టారు. ఈ ఘటనలో లక్ష్మి తలకు గాయం కావడంతో ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలెపొంగు ప్రతాపు, రాణి, మాగి భద్రయ్య, రామూర్తి, ప్రశాంత్, వశపొంగు మల్లయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
**నమస్తే తెలంగాణ**



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



సత్తుపల్లి టౌన్: పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బంది



చింతకాని: పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



మధిర: ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



ముదిగొండ: ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



వైరాటౌన్: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు



వైరా టౌన్: పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్త్

సత్తుపల్లి టౌన్, మే 26: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఆదివారం ప్రశాంతవాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు పూర్తిచేశామని కల్లూరు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్ రాజేందర్‌గౌడ్ తెలిపారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 17,345 మంది ఉండగా వీరిలో 10,888 పురుషులు, మహిళలు 6408 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలను చేశామని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ముగ్గురు తహసీల్దార్లను ఎన్నికల సెక్టార్ అధికారులుగా నియమించామని, పోలింగ్ సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నిక జరిపేందుకు ఓటర్లు సహకరించాలని ఆయన ఆర్డీవో కోరారు.

**వేంసూరు మండలంలో 2,286 పట్టభద్రుల ఓటర్లు**

వేంసూరు, మే 26: మండలంలో 2,286 మంది ఎమ్మెల్సీ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ ఎంఏ రాజు తెలిపారు. వీరిలో మహిళా ఓటర్లు 850 మంది కాగా, పురుషులు 1,436 మంది ఉన్నారు. ఆదివారం వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

**చింతకాని మండలంలో 1,993 మంది ఓటర్లు**

చింతకాని, మే 26: చింతకానిలో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,993మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఎంపీడీవో రెబెల్లి రామయ్య తెలిపారు.

ఒక్కో పోలింగ్ బూత్‌లో ఐదుగురు సిబ్బందితో పటిష్ఠ ఏర్పాట్లు చేశామని, పట్టభద్రులు ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

**మధిర నియోజకవర్గంలో 11,495**

మధిర, మే 26: ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ 14 కేంద్రాల్లో 11,435 మంది పట్టభద్రుల ఓటర్లుగా ఉన్నారు. మధిర మండలంలో 3,378 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు.

**తిరుమలాయపాలెం మండలంలో 2,468 ఓటర్లు**

తిరుమలాయపాలెం, మే 26: చేశారు. మండలంలో 2,468 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**కూసుమంచి మండలంలో 3,036 ఓటర్లు**

కూసుమంచి, మే 26: సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూసుమంచి మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 3,036 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సులు కూసుమంచి ఉన్నత పాఠశాలకు చేర్చారు. ఎంపీఈవో రామచంద్రర్ రావు, కూసుమంచి ఇంచార్జి నరేశ్ ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా నేలకొండపల్లి మండగలం కేంద్రంలో 3,180 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

**ముదిగొండ మండలంలో 2,205 మంది ఓటర్లు**

ముదిగొండ, మే 26: సోమవారం జరుగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టదుభద్రుల ఉప ఎన్నిక కోసం అధికారులు మండలంలో పూర్తి ఏర్పాట్లు చేశారు. ముదిగొండలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మండల వ్యాప్తంగా 2,205 మంది ఓటు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నేపథ్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

**వైరా మండలంలో 2,830 మంది ఓటర్లు**

వైరాటౌన్, మే 26: సోమవారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైరా మండలంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 2,830 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పోలింగ్ ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపాలిటీ కమిషనర్ వేణు, ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్, అధికారులు పరిశీలించారు.

## ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం : కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ (ఇన్‌సెట్), హాజరైన సిబ్బంది

మామిళ్లగూడెం, మే 26 : ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 4వ తేదీన జరిగే లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఖమ్మంరూరల్ మండలం, పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఖమ్మం లోకసభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఖమ్మం లోకసభ నియోజకవర్గ పరిధిలో ఓట్ల లెక్కింపుకు 8 హాళ్లు సిద్ధం చేశామని, ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక హాల్ చొప్పున 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు 7 హాళ్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ఒక హాల్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో హాల్లో 14 టేబుళ్ల చొప్పున, ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్లో 355 పోలింగ్ కేంద్రాలు ఉన్నందున 18 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ యూనిట్ ట్యాగ్‌లు పరిశీలించుకోవాలని, ఫారం17-సిలో ఓట్లు, కంట్రోల్ యూనిట్‌లో ఓట్లను సరి చూసుకోవాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో టోటల్, రిజల్ట్ బటన్‌లు మాత్రమే వాడాలని, ఏ ఒక్క కంట్రోల్ యూనిట్‌లో మెమోరి డిలీట్ చేయడానికి వీలులేదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలో ఓట్ల లెక్కింపుపై కలెక్టర్ వివరించారు. వివిధ దశల్లో ఎదురయ్యే సమస్యలు, వాటిని పరిష్కరించే విధానాన్ని వివరించారు. కౌంటింగ్ హాల్‌లో అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రో ఇన్‌చార్జిల పాత్ర కీలకమన్నారు. డేటాను సరైన విధంగా పట్టిక రూపంలో పొందుపరచడంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా రౌండ్ల వారీ ఫలితాలు వెల్లడించాలన్నారు. పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ నోడల్ అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, శిక్షణ నోడల్ అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్, సహాయ శిక్షణ నోడల్ అధికారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పామాయిల్ సాగుపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, మే 26: ఖమ్మం నగరం బాలపేటలో గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యంగా పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పామాయిల్ సాగు ద్వారానే పొందవచ్చునన్నారు. పామాయిల్ సాగు వేసిన రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్, మాజీ ఏఎంసీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్, రఘునాథపాలెం పీఏసీఎస్ చైర్మన్ తాతా రఘురాం, చెరుకూరి పూర్ణ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన సండ్ర



భిక్షపతిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మే 26: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భిక్షపతి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ఆయన నివాసానికెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట కొడిమెల అప్పారావు, మాచినేని నరేంద్ర, జువ్వాడ అప్పారావు, పాలకుర్తి రాజు, అశోక్, మోరంపూడి కృష్ణ, యాగంటి నరసింహ, చందు, హరిబాబు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రఘునాథపాలెం, మే 26: గుర్తుతెలియని లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం ఖమ్మంనగర పరిధి ఇల్లెందు రోడ్డులో చోటుచేసుకున్నది. ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ తెలిపిన ప్రకారం.. ఖమ్మం నగరం రాపర్తినగర్‌కు చెందిన బండారి జీవన్(18) తన మిత్రుడు షాహీద్‌తో కలిసి రఘునాథపాలెంలో పాలు తీసుకవచ్చేందుకు ఆదివారం ఉదయం బైక్‌పై వెళ్లాడు. తిరిగి ఖమ్మం వచ్చేక్రమంలో మార్గమధ్యంలో వెనుక నుంచి గుర్తు తెలియని లారీ జీవన్, షాహీద్ ప్రయాణిస్తున్న బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీవనం తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. బైక్‌ను నడిపిన షాహీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పెట్రోల్ బంక్‌లో మోసం!

కొత్తగూడెం క్రైం, మే 26 : పెట్రోల్ బంకులో మోసానికి పాల్పడిన వ్యక్తులపై జిల్లా తూనికలు-కొలతల అధికారి కె. మనోహర్ కేసు నమోదు చేశారు. వివరాలోకెళ్తే.. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన జైలుద్దీన్, చావా నాగేశ్వరరావు పనిమీద కొత్తగూడెం వచ్చి, తిరిగి వెళ్లే క్రమంలో పోస్టాఫీస్ ఏరియాలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించారు. రెండున్నర లీటర్ల పెట్రోల్‌కి కొట్టిస్తే లీటరు పెట్రోల్ తేడా రావడంతో బంకు మేనేజ్‌మెంట్‌ని నిలదీశారు. వారు వాగ్వాదం చేయడంతో బాధితులు తూనికలు, కొలతల అధికారికి సమాచారం ఇచ్చారు. తూనికలు-కొలతల జిల్లా అధికారి కె. మనోహర్ బంకుకి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బంకు సిబ్బంది సదరు బాధితులకంటే ముందుగా వచ్చిన వ్యక్తికి వాహనంలో పెట్రోల్ నింపి, మీటర్ జీరో చేయకుండా నేరుగా జైలుద్దీన్, నాగేశ్వరరావు వాహనంలో పెట్రోల్ నింపారు. ఈ తప్పిదాన్ని గుర్తించిన అధికారి మనోహర్ బంకు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చేసిన మోసాన్ని పరిగణలోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

## 'ఆహారపు అలవాట్లే వ్యాధులకు కారణం'



ప్రసంగిస్తున్న డాక్టర్ కేవై రాంచందర్‌రావు

ఖమ్మం సిటీ, మే 26: పురుగులమందుల అవశేషాలతో కూడిన పదార్థాలతో పాటు ఆధునిక ఆహారపు అలవాట్లే సమస్త వ్యాధులకు ప్రధాన కారణమని నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగ విద్యాలయ వైద్యుడు కేవై రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మం పెవిలియన్‌గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చక్కని జీవనశైలిని అలవర్చుకుంటే సమయంతోపాటు వృధా ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. అందరూ రోజూ శరీరాన్ని శ్రమింపజేసి తగిన నీరు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాకం శ్యాంబాబు, నిర్వాహకులు కే వెంకట్, పిల్లి సుదర్శన్, వీ జ్యోతి, మచ్చ లక్ష్మి, మాధవి, తాళ్లూరి వేణు, విజయ్‌కుమార్, వెంకట్‌బాబు, నాగన్న పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

టేకులపల్లి, మే 26 : మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల పోలింగ్ బూత్‌లను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను.ఆదివారం పరిశీలించారు. స్థానిక సీఐ తాటిపాముల సురేశ్‌తో కలిసి రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై సైదా రవూఫ్, సిబ్బంది నరసింహారావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## 'రాకేశ్‌రెడ్డి వైపే పట్టభద్రుల మొగ్గు'

జూలూరుపాడు, మే 26 : ఖమ్మం-నల్గొండ-వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి వైపే పట్టభద్రులు మొగ్గు చూపుతున్నారని, రాకేశ్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, వైరా నియోజకవర్గ బాధ్యులు లాకావత్ గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు కుటుంబంలో పుట్టి బిట్స్‌ఫిలానీలో గోల్డ్‌మెడల్ సాధించి అమెరికాలో వచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకొని నీతివంతమైన రాజకీయాల కోసం నిత్యం శ్రమించే రాకేశ్‌రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే అని తెలిపారు.

## నేత్రదానం చేద్దాం...

భద్రాచలం, మే 26: నేత్ర దానం చేద్దాం.. కంటి వెలుగునిద్దామని సీనియర్ ఐ బ్యాంకు టెక్నిషియన్ జానీ అన్నారు. ఆదివారం నేత్ర దానంపై ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేత్రదానానికి ముందుకు వచ్చేవారు నేరుగా సమీపంలోని భద్రాచలంప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సంప్రదిస్తే, అక్కడికే వెళ్లి నేత్రాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు.

## మీటర్ రీడింగ్‌ను పరిశీలించాలి

కొత్తగూడెం టౌన్, మే 26 : వినియోగదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకునేటప్పుడు తప్పనిసరిగా మీటర్ రీడింగ్ జీరో ఉందా లేదా పరిశీలించాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి మనోహర్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న శ్రీనివాస్ ఫిల్లింగ్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పెట్రోల్ లేదా డీజిల్ పోయించుకునేటప్పుడు మీటర్ జీరో ఉందా లేదా అన్నది సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. ఆదివారం ఒక వాహనదారుడికి రీడింగ్ జీరో చేయకుండా పెట్రోల్ పోసినందున తక్కువ వచ్చినట్లు ఫిర్యాదు వచ్చిందని, తనిఖీ చేసి పరిశీలించామని అన్నారు. తన పరిశీలనలో పెట్రోల్, డీజిల్ సక్రమంగానే జరుగుతున్నట్లు చెప్పారు. కేవలం పెట్రోల్ పోసేటప్పుడు మీటర్ జీరో చేయకపోవడం వల్ల వినియోగదారుడికి తక్కువ పెట్రోల్ వచ్చిందని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## హోమియో మందుల పంపిణీ



హోమియో మందుల పంపిణీ శిబిరం

ఖమ్మం సిటీ, మే 26: ఖమ్మం జర్నలిస్టులకు ప్రముఖ హోమియో వైద్యుడు పరికిపండ్ల అశోక్ ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. ఆదివారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో టీ యూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ప్రక్రియను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాంనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచితంగా హోమియో మందులు అందించడం అభినందనీయమన్నారు. డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకే మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. రైళ్లలో ఐదు సాధారణ జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మైసా పాపారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు నర్వనేని వెంకట్రావ్, వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, నామా పురుషోత్తం, మేడి రమేశ్, పసుపులేటి సత్యనారాయణ, కళ్యాణ్, మధులత పాల్గొన్నారు.

## పశువులు తరలిస్తున్న వ్యాన్ సీజ్

అశ్వారావుపేట, మే 26 : అనుమతులు లేకుండా పశువులు తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా పాయకరావు పేట మండలం ఎస్.రాజవరం గ్రామానికి చెందిన తురందాస్ వీర శివ, నరసింహారావు తుని సంతలో ఆవులను కొనుగోలు చేసి వ్యాన్‌లో హైదరాబాద్ తరలిస్తున్నారు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వ్యాన్‌లో 11 పశువులను గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే పశువులను తరిలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేశారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు. వ్యాన్ డ్రైవర్ శ్రీనుతో పాటు పశువులు తరలిస్తున్న ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## అక్రమ బదిలీలు నిలిపివేయాలి

మణుగూరు టౌన్, మే 26: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఇష్టానురీతిగా బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య అన్నారు. ఆదివారం పీవీకాలనీలోని కేఎల్ మహేంద్రభవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలలో పారదర్శకత పాటించకుండా కేవలం కొందరికి ప్రయోజనం కల్పించేందుకే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. ఏరియా ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మార్చుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు, నంబూరు శ్రీనివాసరావు, గోలి గంగాధర్, అబ్దుల్ సుభాని, ఆవుల నాగరాజు, ఆదెర్ల సురేందర్, ఫిట్ సెక్రటరీలు గుండ్లపల్లి శరత్, దండు వీరవిజయ్కుమార్, గడ్డం సంతోష్ పాల్గొన్నారు.